క్లుప్తంగా

చెన్నమల్లేశునికి అన్నాభిషేకం



అమలాపురం టౌన్: పట్టణంలోని పురాతన శివక్షేత్రం శ్రీ భ్రమరాంబిక సమేత చెన్నమల్లేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి అన్నాభిషేకం మంగళవారం వైభవంగా జరిగింది. పట్టణానికి చెందిన పంచాంగ కర్తలు, పురోహితులైన ఉపద్రష్ట కుటుంబీకుల ఆధ్వర్యంలో కార్తిక మాసం ఏకాదశ పర్వదినాన మల్లేశునికి అన్నాభిషేకంతో పాటు ఏకాదశ రుద్రాభిషేకం, లక్షపత్రి పూజ కన్నుల పండువగా జరిగాయి. వేలాది మంది భక్తులు పూజా క్రతువులను తిలకించి తరించారు. పంచాంగకర్త ఉపద్రష్ట నాగాదిత్య, పురోహితులు విమలాదిత్య, విక్రమాదిత్య ఆధ్వర్యంలో ఈ పూజా క్రతువులు జరిగాయి. అనంతరం రాత్రి ఉపద్రష్ట ప్రాంగణంలో జరిగిన అన్న సమారాధనలో వేలాది మంది భక్తులు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



నీలపల్లిలో దుర్గారావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పొన్నాడ, పితాని తదితరులు

తాళ్లరేవు: మండలంలోని పలు బాధిత కుటుంబాలను ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణ తదితరులు పరామర్శించారు. నీలపల్లిలో మాతృ వియోగంతో బాధ పడుతున్న పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కట్టా దుర్గారావు, ఇంజరంలో ఇటీవల మృతి చెందిన అమలాపురం సత్యన్నారాయణ, కోరంగి పంచాయతీ చినబొడ్డు వెంకటాయపాలెంలో మృతి చెందిన మల్లాడి సత్తిబాబు కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో వైస్ ఎంపీపీ కొపనాతి లలిత, నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

బెల్టుషాపులపై ఎక్సైజ్ దాడులు

ముమ్మిడివరం: బెల్టుషాపులు నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి నుంచి 22 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ముమ్మిడివరం ఎక్సైజ్ సీఐ ఎల్.చిరంజీవి తెలిపారు. ముమ్మిడివరం మండలం అయినాపురం గ్రామంలో మట్టా నాగభూషణం బెల్ట్‌షాపు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో అతని షాపుపై దాడి చేసి తొమ్మిది మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు. మరోచోట ఐ.పోలవరం మండలం మురమళ్ల గ్రామానికి చెందిన యనమదల హనుమంతరావు బెల్ట్‌షాపుపై దాడిచేసి అతని వద్ద 13 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

కొనలేం.. తినలేం!

- కొండెక్కిన కూరగాయల ధరలు
- కార్తికమాసం కావడంతో మరింత ప్రియం
- అవస్థలు పడుతున్న సామాన్యులు



భారీగా పెరిగిన కూరగాయల ధరలతో పేద, మధ్య తరగతి ప్రజలు వాటిని కొనుక్కొని తినలేని దుస్థితి ఏర్పడింది.

ముమ్మిడివరం: కూరగాయల ధరలు ఆకాశాన్ని తాకుతుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. కొత్తిమీర నుంచి ఉల్లిపాయల వరకు ఏ ఒక్కటీ అంటుబాటులో లేకపోవడంతో సాధారణ ప్రజలు విలవిల్లాడిపోతున్నారు. రూ.500లు తీసుకొని మార్కెట్‌కు వెళితే కనీసం సంచి సగం కూడా నిండడం లేదని ఆవేదన చెందుతున్నారు. నియోజకవర్గంలో ఎక్కడా రైతుబజార్లు లేకపోవడంతో అధిక ధరలకు ప్రజలు కూరగాయలు కొనుగోలు చేస్తున్నారు. ప్రతి ఏడాది అక్టోబర్, నవంబరు నెలల్లో కూరగాయల ధరలు పెరగడం మామూలే అయినప్పటికీ ఈ ఏడాది ధరలు దారుణంగా పెరగడంతో కొనుక్కొని తినే పరిస్థితులు లేవని వినియోగదారులు వాపోతున్నారు.

అన్నసమారాధనలతో పెరుగుదల

కార్తికమాసం అంటేనే ఎంతో పవిత్రమైన మాసం. ఈ మాసంలో ఎక్కడ చూసినా అధ్యాత్మిక వాతావరణం నెలకొంటుంది. ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతుంటాయి. ఈ నేపథ్యంలో అనేక చోట్ల మాలధారులు, భక్తులకు భారీ ఎత్తున అన్నసమారాధనలు జరుగుతుంటాయి. ఈ కారణంగా కూడా కూరగాయల ధరలు పెరుగుతున్నాయని చెప్పొచ్చు. ఏది ఏమైనా కూరగాయల ధరల పెరుగుదలపై కార్తిక మాసం ప్రభావం కూడా ఉందని చెప్పాలి. ఈ మాసంలో చాలా మంది మాంసాహారం తినరు. నెలంతా శాఖాహారమే తీసుకుంటారు. దీనివల్ల కూరగాయలు కొనుగోలు చేసేవారి సంఖ్య పెరుగుతుంది. కూరగాయల ధరల పెరుగుదలకు ఇది కూడా కారణంగా మారింది.

ముమ్మిడివరం మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలోల్లో

వంకాయలు	రూ. 40
టమాటాలు	రూ.50
ఉల్లిపాయలు	రూ.50
వెల్లుల్లి	రూ.350
అల్లం	రూ.70
పచ్చిమిర్చి	రూ.50
బీరకాయలు	రూ.50
చిక్కుడుకాయలు	రూ.70
బెండకాయలు	రూ.60
దొండకాయలు	రూ.40
కాలీఫ్లవర్	రూ.70
బీట్‌రూట్	రూ.40
బంగాళాదుంపలు	రూ.60
ఆనపకాయ	రూ.30
కొత్తిమీర కట్ట	రూ.30

మాంసాహారంతో సమానంగా ధరలు



కూరగాయల ధరలు అమాంతంగా పెరిగాయి. సామాన్యులకు అందుబాటులో లేవు. చాలా రకాల కూరగాయల ధరలు మాంసాహారంతో సమానంగా పెరిగిపోయాయి. ఇలా అయితే పేద, మధ్య తరగతి ప్రజలు ఏలా కొనగలరు. ప్రభుత్వం ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

– వరసాల పుష్పావతి, గృహిణి, గాడిలంక.

డబ్బుకు విలువ లేదు



గతంలో రెండు వందలు తీసుకొని బజారుకు వెళితే సంచి నిండిపోయేది. ఇప్పుడు ఐదు వందలు తీసుకెళ్లినా సంగం సంచి కూడా నిండడం లేదు. ఏ కూరగాయలు చూసినా కిలో రూ.50లకు తగ్గడం లేదు. పచ్చిమిర్చి ధర కూడా పెరిగిపోయింది.

– కాట్రు అప్పారావు, వినియోగదారుడు, అయినాపురం.

కాశీ విశ్వేశ్వరునికి లక్ష రుద్రాక్షపూజ



తాళ్లరేవు: పిల్లంక, బ్రహ్మపురి గ్రామాల సరిహద్దులో వేంచేసి యున్న శ్రీ కాశీఅన్నపూర్ణ సమేత శ్రీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రాత్రి వైభవంగా పూజలు నిర్వహించారు. స్వామివారికి పంచముఖ రుద్రాక్షలతో లక్ష రుద్రాక్షపూజ, లక్ష బిల్వదళాలతో అభిషేకాన్ని కన్నుల పండువగా చేపట్టారు. బ్రహ్మపురి గ్రామ సర్పంచ్ సాగి వెంకట సత్యవతి, వీరభద్రరాజు దంపతుల ఆధ్వర్యంలో వేద పండితులు వేలూరి వెంకట కామేశ్వరశర్మ(కాశిబాబు) పర్యవేక్షణలో వేద పండితులు మర్ల ఫణిశర్మ, చావలి రవికుమార్, గుత్తెన వీరభద్రశర్మ, మేడవరపు బ్రహ్మన్న తదితరులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ప్రత్యేక హోమాలు, జ్యోతిర్లింగార్చన జరిగాయి.

ఘనంగా లక్ష బిల్వార్చన

ఉప్పలగుప్తం: మండలంలోని మునిపల్లి గ్రామంలో వేంచేసి యున్న పార్వతీ మల్లేశ్వరస్వామి ఆలయంలో పండితులు కొమాళ్లపల్లి కాశీవిశ్వనాథశర్మ ఆధ్వర్యంలో లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారిని అందంగా అలంకరించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రేపటి నుంచి సహకార వారోత్సవాలు



కలెక్టరేట్‌లో సహకార వారోత్సవాల గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్

అమలాపురం రూరల్: 'వికసిత్ భారత్ నిర్మాణంలో సహకార సంఘాల పాత్ర' అనే అంశంపై 71వ అఖిల భారత సహకార వారోత్సవాలను 14 నుంచి 20 వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. మంగళవారం వారోత్సవాల గోడ పత్రికను కలెక్టర్ చాంబర్‌లో ఆయన ఆవిష్కరించారు.71వ అఖిల భారత వారోత్సవాలను విజయవాడ రాష్ట్ర సహకార యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘాలలో త్వరితగతిన కంప్యూటరీకరణ పూర్తి చేయాలని ఆదేశించారు. వారోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి ఎస్ మురళీకృష్ణ, జిల్లా వారోత్సవాల ఇన్‌చార్జి ఆది మూలం వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ రిజిస్ట్రర్లు జి.సత్యప్రసాద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి క్యాన్సర్ స్క్రీనింగ్‌పై ఇంటింటి సర్వే

క్యాన్సర్ స్క్రీనింగ్‌పై ఇంటింటి సర్వేను ఈనెల 14 నుంచి 9 నెలల పాటు నిర్వహించడం జరుతుందని కలెక్టర్ మహేష్ కుమార్ తెలిపారు. ఇంటింటి సర్వే గోడపత్రికను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. క్యాన్సర్ స్క్రీనింగ్ సర్వేలో భాగంగా మంగళ, బుధ, గురువారాలలో ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా వర్కర్లు ఇంటింటి సర్వేలో పాల్గొని వ్యాధులను గుర్తించి వైద్యసేవలు అందేవిధంగా చూస్తారన్నారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఎం. దుర్గారావు దొర, అదనపు డీఎంఅండ్‌హెచ్‌వో సీహెచ్ భరతలక్ష్మి, ఎన్‌సీటీ కోఆర్డినేటర్ జాన్‌లెవ్వి తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల కార్తిక వనసమారాధన

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక కన్యకా పరమేశ్వరీ ఆలయ కల్యాణ మండపం వద్ద కార్తిక వనసమారాధన సోమవారం ఆత్మీయ వాతావరణంలో జరిగింది. కుటుంబ సమేతంగా అంతా సహపంక్తి భోజనాలు చేశారు. భోజనాలకు ముందు వాసవీమాతను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. సంఘం అధ్యక్షుడు నంబూరి సత్యనారాయణమూర్తి, కార్యదర్శి నంబూరి నరేష్, కార్తిక వన సమారాధన కమిటీ చైర్మన్ సింగొశెట్టి కుమార్, కో చైర్మన్లు బోణగిరి పంచముఖి, చక్కా ప్రవీణ్, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కంచర్ల బాబి, ఆర్యవైశ్య సంఘం నాయకులు వరదా సూరిబాబు, అప్పన వీరన్న తదితరులు వనసమారాధనను పర్యవేక్షించారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శిగా శ్రీనివాస్

ముమ్మిడివరం: బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శిగా ముమ్మిడివరం మండలం అనాతవరం గ్రామానికి చెందిన కముజు శ్రీనివాస్ నియమితులయ్యారు. ఆదివారం శ్రీశైలంలో జరిగిన సంఘ రాష్ట్ర సంఘ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. బీసీల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. తనను నియమించిన జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావులకు ధన్యవాదాలు తెలిపారు.

అపరిశుభ్ర తాగునీటి సరఫరాపై ఫిర్యాదు



నలుపు రంగులో మారిన తాగునీరు

యానాం: నియోజకవర్గ పరిధిలో పలు ప్రాంతాల్లో మంగళవారం రక్షిత మంచినీటి పథకం ద్వారా సరఫరా చేసిన తాగునీరు అపరిశుభ్రంగా ఉండటంతో స్థానికులు పీడబ్ల్యూడీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక అంబేడ్కర్‌నగర్ తదితర ప్రాంతాలకు సరఫరా చేసిన తాగునీరు నలుపు రంగులో ఉందని వాపోయారు. ప్రజారోగ్యంతో సంబంధిత సిబ్బంది చెలగాటమాడుతున్నారని దీనిపై ఆర్ఏఓ, పీడబ్ల్యూడీ ఈఈకు ఫిర్యాదు చేసినట్లు సోషల్ యాక్టివిస్టు, పర్యావరణ పరిరక్షణ సమితి యానాం శాఖ కోఆర్డినేటర్ దుగ్గుదుర్తి అనిత తెలిపారు.

వ్యాపారులు నిబంధనలు పాటించాలి

యానాం: నియోజకవర్గ పరిధిలో వ్యాపార వర్గాలు తూనికలు, కొలతలశాఖ నిబంధనలు తప్పక పాటించాలని తూనికలు-కొలతల శాఖ డిప్యూటీ తహసీల్దార్ గణేషన్ మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. కిరాణా దుకాణాలు, డిపార్ట్‌మెంటల్ స్టోర్స్, బేకరీలు, స్వీట్‌షాప్‌లు తదితర సంస్థలు తాము ప్యాకేజీ చేస్తున్న వస్తువులకు సంబంధించిన పూర్తి వివరాలను తప్పనిసరిగా ముద్రించాలన్నారు. ప్యాకేజీ చేయబడిన వస్తువులను విక్రయించే వ్యాపారులు తమ వివరాలను యానాంలో తూనికలు-కొలతల శాఖ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని అనంతరం పొందిన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను విక్రయించే షాపు వద్ద స్పష్టంగా కనిపించేవిధంగా పెట్టాలని కోరారు. మద్యం బాటిళ్లను సైతం ఎమ్ఆర్‌పీ ధరలకే విక్రయించాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కేవీ

అల్లవరం: అల్లవరం తూర్పులంక గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కడలి వెంకటేశ్వరరావు (కేవీ) శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. శెట్టిబలిజ కార్పొరేషన్‌లో అల్లవరం మండలానికి చెందిన వ్యక్తికి చోటు కల్పించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. కార్యకర్త స్థాయి నుంచి కార్పొరేషన్ డైరెక్టర్‌గా పదవి చేపట్టిన కేవీని పలువురు ప్రజాప్రతినిధులు, శెట్టిబలిజ సంఘస్తులు అభినందించారు.

ఫ్లెక్సీల తొలగింపు



తాళ్లరేవు ప్రధాన రహదారిలో ఫ్లెక్సీలను తొలగిస్తున్న సిబ్బంది

తాళ్లరేవు: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వెలువడడంతో మండల పరిధిలోని గ్రామాల్లో నాయకుల ఫ్లెక్సీలు, కటౌట్‌లను పంచాయతీ సిబ్బంది తొలగిస్తున్నారు. మండలకేంద్రం తాళ్లరేవు పంచాయతీ కార్యదర్శి నున్న శంకరనారాయణ ఆదేశాలతో సిబ్బంది ఫ్లెక్సీలను తొలగించే పనిలో నిమగ్నమయ్యారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

అధికారులకు జేసీ నిషాంతి ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నిషాంతి

అమలాపురం రూరల్: జిల్లాలో ఖరీఫ్ వరికోతలు ప్రారంభం .కావడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి విజయవంతం చేయాలని జేసీ టి.నిషాంతి అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పురోగతిపై సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ కస్టోడియన్ అధికారులు వాహనాల మూమెంట్ అధికారులుగా వ్యవహరిస్తూ మిల్లుల వద్ద వాహనాలు నిలిచిపోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. 48 గంటల్లో ధాన్యం సొమ్ము రైతు ఖాతాకు జమ కావాలన్నారు. హమాలీల యూనియన్ లీడర్ల సెల్ నెంబర్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. తూనికలు-కొలతల శాఖవారు తూనికలు వే స్కేల్స్ పూర్తిగా తనిఖీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో పౌరసరఫరాల జిల్లా మేనేజర్ బాల సరస్వతి, జిల్లా పౌర సరఫరాల అధికారి ఉదయ భాస్కర్, జిల్లా వ్యవసాయ అధికారి బోసుబాబు, జిల్లా రవాణా అధికారి డి. శ్రీనివాసరావు, జిల్లా మార్కెటింగ్ అధికారి కే విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం



పవర్ లిఫ్టింగ్ పోటీలను ప్రారంభిస్తున్న డీఈఓ షేక్ సలీం బాషా తదితరులు

అమలాపురం రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి అండర్- 17 బాల, బాలికల పవర్ లిఫ్టింగ్ పోటీలు, ఎంపికలను అమలాపురం ఇందుపల్లిలోని జెడ్పీ హైస్కూల్‌లో డీఈఓ షేక్ సలీం బాషా ప్రారంభించారు. దీనికి హెచ్ఎం విత్తనాల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డీఈఓ బరువులు ఎత్తి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు దోహదపడతాయని అన్నారు. సర్పంచ్ చోళ్లంగి శివాలని, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ అడబాల విజయ్ శ్రీనివాస్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ సెక్రటరీ బీబీఎస్ ఎన్ మూర్తి, మేడిశెట్టి గణపతి రామారావు, డీవైఈఓ గుబ్బల సూర్యప్రకాశం, డీఎస్‌డీ ఒ.సురేష్‌బాబు, క్రీడా భారతి అధ్యక్షుడు అల్లాడి శరత్‌బాబు పాల్గొన్నారు. ఇటీవల మండల విద్యాశాఖ అధికారిగా పదోన్నతి పొందిన రేలంగి నాగకుమార్, భమిడిపాటి అప్పాజీలను డీఈఓ సత్కరించారు.

కాపు వనసమారాధన కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కాపు నాయకులు

అమలాపురం టౌన్: అమలాపురం కాపు కల్యాణ మండపంలో ఈనెల 20న నిర్వహించనున్న కాపు కార్తిక వనసమారాధన కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను కాపు నాయకులు మంగళవారం ఆవిష్కరించారు. కాపు నాయకుడు మెట్ల రమణబాబు స్వగృహం వద్ద ఈ కార్యక్రమం జరిగింది. కాపు నాయకులు మెట్ల రమణబాబు, నల్లా స్వామి, బొర్రా వెంకటేశ్వరరావు, బొర్రా ఈశ్వరరావు, నల్లా మల్లిబాబు, గంధం శ్రీను, నల్లా చిట్టిబాబు, సాధనాల సురేష్, యాళ్ల సుధీర్ తదితరులు పాల్గొన్నారు. అధిక సంఖ్యలో సంఘీయులు తరలిరావాలని వారు కోరారు.

గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌లపై అవగాహన

అమలాపురం రూరల్: మహిళలు, విద్యార్థినుల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తించినా, ర్యాగింగ్‌కు పాల్పడినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని అమలాపురం ఎస్సై శేఖర్‌బాబు సూచించారు. బండారులంక ఉన్నత పాఠశాలలో మంగళవారం మహిళా సంరక్షణపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌లపై అవగాహన కల్పించారు. అపరిచితులతో జాగ్రత్తగా మెలగాలని సూచనలు చేశారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ



సత్యనారాయణను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కృష్ణకిషోర్

అమలాపురం రూరల్: రాజమహేంద్రవరం ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇంటర్ కళాశాలల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాల ఎంబీఏ ద్వితీయ సంవత్సరం విద్యార్థి సంసాని నాగవెంకట సత్యనారాయణ ద్వితీయ స్థానం సాధించి రజిత పతకాన్ని సాధించాడు. ఈ సందర్భంగా మంగళవారం విజేతను కళాశాల పాలక మండలి అధ్యక్షుడు ఎస్.సుబ్బరాజు, సభ్యుడు డీఎస్ఎన్ రాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ పెచ్చెట్టి కృష్ణకిషోర్, పీడీ ఐ.సురేష్, అధ్యాపకులు అభినదించారు.

విరిగిపడిన విద్యుత్ స్తంభం



విరిగిపోయి రహదారిపై పడ్డ విద్యుత్ స్తంభం

యానాం: యానాం-పరంపేట రహదారిలో కురసాంపేట మలుపు ప్రాంతంలో సోమవారం విద్యుత్ లైట్ల స్తంభం అకస్మాత్తుగా విరిగి రోడ్డుపై పడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ సంచరించకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. నిత్యం వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే ఈ రహదారి వెంబడి తీర ప్రాంత గ్రామాలకు, చమురు సంస్థల్లో పనులకు కార్మికులు వెళుతుంటారు. గతంలో ఇలాంటి వందలాది విద్యుత్‌లైట్ల స్తంభాలను పార్కులు, పట్టణ కూడళ్లు, బీచ్ ప్రాంతంలో నెలకొల్పారని వీటిని నిర్వహణ లేక వదిలి వేయడంతో దాదాపు కూలిపోయే స్థితికి వచ్చాయని స్థానికులు వాపోతున్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించండి

అమలాపురం టౌన్: పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు ఆటోడ్రైవర్లు సహకరించాలని ట్రాఫిక్ ఎస్సై ఏసుబాబు సూచించారు. స్థానిక వాసర్ల గార్డెన్స్‌లో ఆటో డ్రైవర్లకు మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆటోడ్రైవర్లు డ్రైవింగ్ సమయంలో మద్యం సేవించరాదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలకు తావు లేకుండా ఉంటుందన్నారు. పోలీసులకు ఆటోడ్రైవర్ల సహకారం ఎప్పుడూ ఉంటుందని జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు అన్నారు. అనంతరం పట్టణంలోని శుభకలశం సెంటర్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో వాసర్ల గార్డెన్స్‌లో జరిగిన కార్తిక వనసమారాధనకు పట్టణంలోని పలు ఆటో యూనియన్లకు చెందిన ఆటో డ్రైవర్లు, వారి కుటుంబీకులు పాల్గొని సహపంక్తి భోజనాలు చేశారు.

జిల్లా రిసోర్స్‌పర్సన్ల నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం రూరల్: ఏపీ ఫుడ్ ప్రోసెసింగ్ సొసైటీ అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలో జిల్లా రిసోర్స్ పర్సన్‌లుగా ఇన్సెంటివ్ పద్ధతిలో పని చేయడానికి ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు కోరుతునట్లు జిల్లా ఉద్యాన అధికారి, కార్యనిర్వాహక సంచాలకులు బీవీ రమణ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఫుడ్ ప్రోసెసింగ్‌లో డిగ్రీ గానీ అగ్రికల్చర్, హార్టికల్చర్, ఇతర డిగ్రీ అయినా పూర్తిచేసి ఉండాలన్నారు. కంప్యూటర్ పరిజ్ఞానం, బ్యాంకింగ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా ఆహార పరిశ్రమల ఏర్పాటు కోసం ఔత్సాహికులకు అవగాహన కల్పించటం, బ్యాంకు లింకేజీ చేయించటం తదితర పనులను వీరు చేపట్టాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆఫీసులో నిర్ణీత వేళల్లో సంప్రదించాలన్నారు.

బెల్ట్‌షాపు నిర్వాహకులపై బైండోవర్ కేసులు

అమలాపురం టౌన్: ఇద్దరు బెల్ట్‌షాపు నిర్వాహకులను అమలాపురం ఎక్సైజ్ అధికారులు అంబాజీపేట మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్, తహసీల్దార్ వీవీఎల్ నరసింహారావు ఎదుట హాజరు పరిచారు. వీరిపై బైండోవర్ కేసులు నమోదు చేయగా మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ఇద్దరికీ చెరో రూ.లక్ష చొప్పున ష్యూరిటీ విధించారని అమలాపురం ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ తెలిపారు.

గ్రామాల్లో ఉచిత వైద్యశిబిరాలు

అమలాపురం రూరల్: సమనస, వన్నెచింతలపూడి గ్రామాలలో డెంగీ జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో భీమనపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించారు. వైద్యాధికారిణి డాక్టర్ ప్రసన్న ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి రోగులకు చికిత్స అందించారు. గ్రామాలలో నాలుగు బృందాలను ఏర్పాటు చేసి ఇంటింటి సర్వే చేపట్టారు. జ్వరపీడితులు గ్రామంలోని సిబ్బందికి తెలియజేసి వైద్యసేవలు పొందాలని సూచించారు.

నీటిసంఘాల ఎన్నికలకు సన్నద్ధం కండి

ఉప్పలగుప్తం: నీటిసంఘాల ఎన్నికలకు అధికారులంతా సన్నద్ధం కావాలని తహసీల్దార్ వి.ఎస్.దివాకర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పోలింగ్ అధికారులు, సహాయ సిబ్బందికి ఆయన మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గొల్లవిల్లి, చల్లపల్లి, ఎస్.యానం, ఎన్.కొత్తపల్లి, ఉప్పలగుప్తం, చినగాడవిల్లి, గోపవరం, కిత్తనచెరువు సాగునీటి సంఘాలకు సంబంధించి ఎన్నికలు ఈ నెల 21న నిర్వహిస్తున్నామని దివాకర్ తెలిపారు. ఇప్పటికే రైతుల ఓటరు జాబితాలను రెవెన్యూ సిబ్బంది సేకరించారని, ఏ విధమైన సందేహాలు ఉన్నా స్థానిక వీఆర్‌వోలను సంప్రదించాలని సూచించారు.